
# ఎండుటాకులు

★



రచన :

శ్రీ ఎ. యం. అయోధ్యా రెడ్డి.

ఆకాశానికి చిల్లులు పడ్డాయ్.

శివమెత్తినట్లుగా వర్షిస్తున్నాయి మేఘాలు.

చిమ్మచీకటి, చీకటికి తోడు రయ్యిమని వీస్తున్న గాలి.

ఉండి ఉండి తళుక్కున మెరుపులు ఆ వెనకనే మేఘాల ఘర్జింపులు.

గుడిసెలో ముడుచుకు కూర్చున్నాడు రాజయ్య. ఒంటిమీద గోచీ తప్ప మరే ఆచ్ఛాదనా లేదు. చలితో వణుకుతున్నాడు.

గుడిసె నాల్గు మూలలా కారుతోంది. కప్పుపోయి మూడేళ్ళవుతోంది, కప్పాలంటే గడ్డిలేదు.

ఈ ఏడు రైతులకే కరువొచ్చింది. ఇంక అతనికేం దొరుకుతుంది? కాలమంతా ఐపోయాక ఈ అకాల వర్షం కురుస్తోంది.

వర్షంలోకి తీక్షణంగా చూస్తున్నాడు రాజయ్య.

మధ్యాహ్నం అనగా దొరక బుచ్చుకొంది. చీకటైనా విడిచి పెట్టటు లేదు. ఒక్క పురుగు కూడా బయట తిరగటం లేదు.

ఎటు చూసినా నీళ్ళే...! వర్షపు నీళ్ళు పాముల్లా మెలికలు తిరుగుతూ ప్రవహిస్తున్నాయి.

పుట్టి బుద్ధి తెలిసాక యింత పెద్ద వర్షం చూడలేదను కొన్నాడు రాజయ్య.

ఏరు నురగలు కక్కుతూ పోత పెడ్తోంది. కట్టలు పొర్లి ఉరుకుతోంది. కట్టు దప్పిన స్వారీ గుర్రంలా పొలాల మీద ఉరుకులు, పరుగులు పెడ్తోంది.

రాజయ్య కుటుంబం పెద్దదే.

తండ్రి చచ్చిన కాణ్ణుంచి మూలపడిన ముసలి తల్లి, పెళ్ళాం లచ్చిమి, యింకా ముగ్గురు సంతానం.

ఈ ముగ్గురే కాకుండా నాలుగోసారి కడుపుతో వుంది లచ్చిమి.

లచ్చిమి గుడిసెలో ఓ మూల శవంలా పడుకొని వుంది. ఆమెలో కదలికలేదు. ప్రాణం మాత్రం వుందనటానికి చిహ్నంగా ఆమె చిన్నగా మూలుగుతోంది.

చిన్న పిల్లాడు పాలకోసం లచ్చిమి ఎదమీదకు ఎగబ్రాకుతున్నాడు. తోలు తిత్తుల్లాగా వున్న బలహీనమైన ఆమె రొమ్ముల్ని ఒకదాన్ని విడిచి, మరోదాన్ని కొరుకుతున్నాడు.

లచ్చిమి దగ్గర పాలులేవు.

తిండి తింటే పాలుండు నేమో...! లచ్చిమి ముద్ద మింగక ఎన్నిరోజులైందో ఆమెకి గుర్తులేదు.

అంచేత లచ్చిమి దగ్గర పాలులేవు.

ఆమె కడుపులో ఆకలి...అంటించిన చితిలా మండుతోంది. పగ రేగిన క్రూర జంతువులా ప్రాణాని చీల్చేస్తూంది. శ్వాస పీలుస్తుంటే గుండెలో [illegible] శూలంతో పొడుస్తున్నట్లుగా నొప్పి.

ఆగిపోతుందను కొంటుంది లచ్చిమి.

లచ్చిమి బాధతో ఏడవలేక పోతూంది. ఏడిస్తే

ఊరోళ్ళ బెట్టే వాళ్ళెవ్వరూ లేరు. కనీసం ఆకలి తీర్చేవారు కూడా లేరు. అట్లాగే కట్టెలా పడుకొనుండి పోవడం మినహా మరేమీ చెయ్యలేక పోతుందామె.

పాలు రాక పోవడంతో కవ్వుమంటూ చంటాడు అచ్చిమి రొమ్మును కసిక్కున కొరికాడు. తనూ కెవ్వు మంది అచ్చిమి. కాని-చప్పుడు బయటకి రాలేదు. అరిచే ఓపిక కూడా లేదామెలో.

రాజయ్య తల తిప్పి, పెళ్ళాం కేసి చూశాడు. అతనికి ఉన్నట్టుండి ఎందుకో భయం వేసింది. .అట్లా చూస్తుంటె, పెళ్ళాం చచ్చిన శవంలా వుంది. రూపు దాల్చిన దెయ్యంలావుంది. శవం మెల్లగా బ్రతుకు తున్నట్లుగా వుంది.

ఈ రాత్రికూడా యింత గంజి కడుపులకు పోక పోతే పెళ్ళాం చావటం ఖాయం అనుకొన్నాడు.

అకస్మాత్తుగా రాజయ్యకు ఆకలి గుర్తొచ్చింది.

కడుపులో ఏనుగుల మంద కుమ్మేస్తోంది.

పిల్లలంతా ఏడ్చిఏడ్చి సోమవొచ్చినట్లుగా నిశ్శబ్దంగా నీళ్ళు కారుతున్న నేలమీదే పడుకొనుండి పోయారు.

ముసల్ది ఏడవటం లేదు కాని ఏదో గొణుగుతోంది అదేమిటో సరిగా వినిపించటం లేదు. బహుశా కొడుకు ఇంత మందిని పస్తులతో చంపుతున్నాడే—అని కాబోయి.

రాజయ్య దీర్ఘంగా నిట్టూర్చాడు-

రాక్షసిలాగా ఉరుముతూ కురుస్తున్న వర్షం కొద్దిగా తగ్గింది, జల్లు పడుతోంది.

మరోసారి గుడిసెలోకి చూశాడు రాజయ్య అచ్చిమి మూలుగు ఆగిపోయింది. చచ్చిందో లేక జారిందో తెలియదు. ముసల్ది నోరు గుహలా తెర్చుకొని పడుకొంది.

అందరూ మువ్వూర్తులా చచ్చిన శవాల్లా కల్పించారు రాజయ్యకు. అతని కొక్కసారిగా ఒళ్ళు జలదరించింది.

G.E.M

జి. ఇ. ఎం.

స్టార్టర్లు మరియు స్విచ్చులనే

అమర్చండి.

టి. పి. ఐ. సి. స్విచ్చులు :—

15 నుంచి 200 ఆంప్స్ వరకు.

ఇనుము క్లాడ్ స్విచ్చులు :—

15 నుంచి 200 ఆంప్స్ వరకు-ట్రిపిల్ పోల్.

15 నుంచి 30 ఆంప్స్ వరకు-డబుల్ పోల్.

15 నుంచి 30 ఆంప్స్ వరకు-ఛేంజ్ ఓవర్.

★

డి. సి. సి. పుష్ బటన్ స్టార్టర్ :—1 నుంచి 8 ఆంప్స్ వరకు.

డిస్ట్రిబ్యూషన్ బోర్డులు మొదలైనవి.



: తయారించువారు :

Ganapathy Engineering Manufacturers (P) Limited

GANAPATHY, Post Box No. 6 COIMBATORE-641 006.

Phone: 23024 :: Tel: "POLESTAR"

అందరి కందరూ చస్తారేమోననే భయం వేసింది.

చివుక్కున లేచాడు రాజయ్య. కొయ్య మీదున్న చిరిగిన రుమాలు అందుకొని గుడిసె బయిటికొచ్చాడు.

ముందుకి నడవబోయిన వాడల్లా హఠాత్తుగా ఆగి పోయాడు_ఎదురునా నల్లటి గొడుగు ఒకటి తన గుడిసె కేసే వొస్తుండట కన్నుల బడింది.

రాజయ్య ఆశ్చర్యంతో_‘ఇంత వర్షంలో ఎవరబ్బా తన గుడిసె కొచ్చేది...!’ అని ఆలోచిస్తూవుండగానే ఆ గొడగు పూర్తిగా దగ్గర కొచ్చేసింది.

రాజయ్య పోల్చుకున్నాడు. ఆయన షావుకారు నాగ భూషణం. నాగభూషణ మంటే సామాన్యుడు కాడు. ఒక చేత ధాన్యపు వ్యాపారాన్ని, మరో చేత వడ్డీ వ్యాపారాన్ని ఏకదీక్షతో నడిపిస్తున్న ఘనుడు. రోడ్ల కాలూవా కాంట్రాక్టు పనులు కూడా చేపడతాడు.

ఆ ఊళ్ళో కల్లా ధనవంతుడు నాగభూషణమే. ఊళ్ళో వున్న సామాన్యులూ, కూలిజనం అంతా... నిత్యావసరాలకి తలవొగ్గి, నాగభూషణం వద్ద డబ్బో గింజలో అప్పుగా పుచ్చుకున్నవారే.

బీదా, బిక్కీ_గుడిసెల్లో వుండే ఎన్ని పాత్రలు..., స్త్రీల మెడల్లోని యెన్ని మంగళసూత్రాలు నాగ భూషణం యింట్లో తాకట్టుగా వుండి పోయాయో లెక్క లేదు.

అటువంటి నాగభూషణం గారు, స్వయంగా... అంత వర్షంలో రాజయ్య గుడిసె కొచ్చాడంటే__ ఆశ్చర్యం, దాని వెంబడే అనుమానమూ తప్పకుండా కల్గుతాయి.

షావుకారు, రాజయ్యను చూడగానే కొంచెం స్థిమిత పడ్డాడు. గొడుగు మూయబోయిన వాడల్లా..., గుడిసె చూరు క్రింద కూడా వర్షం ధారాళంగా కురుస్తుండటం వల్ల ఆ ప్రయత్నం మానుకొని నిలబడ్డాడు.

“ఏరా రాజిగా...! గుడిసె బాగా కారుతున్నట్టుందే...!” అన్నాడు పలకరింపుగా.

“అవును బాంచెను..., పోయినేడు గుడిసె కప్ప లేదు గడ్డి దొరకక”_అన్నాడు వినయంగా రాజయ్య. షావుకారు అసలు విషయం ఏం చెబుతాడో నని భయపడ్తూ.

“నాగవుతలి రెండు మూడూళ్లక వొరద లొచ్చి నయట గదరా...? తెలెలు, ముంతలు, తట్టా బుట్టా అన్నీ కొట్టుక పోతన్నయట...”

“కాదామరి...? తిన్న వాననా సేటూ...! కుండల్తొని కోసినట్లైనాయి.”

“బస్తీ గూడ సగం దాక మునిగి పొయిందట్రా”

“కావొచ్చు కాల్వొక్క గాబట్టి పూర్తిగ కాను ఒడ్డుకే వుందే”

“నా బిడ్డ ఎట్లున్నదో గదరా! మొన్ననే దాన్ని అత్తగారింట్ల తోలొచ్చిన. అల్లుడు ఊర్లోగూడ లేడు నేనేమో పొయ్యొచ్చేతందు గీల్లేదు. వాగుదాటాల్నంటె నా తోని ఐతదా?”

కూతురుకోసం సేటు ప్రాణం కొట్టుక లాడింది.

“మీ అల్లుడు యాడ బోయినడయ్యా?” ఊరుకుండ లేక ప్రశ్నించాడు రాజయ్య.

“ఆయన ఊర్లుంటాడురా? విపారం మీద పోయె, చెప్తె ఇన్పిచ్చుకోకుండ ఆ ఇల్లు వాగు పక్కనే కట్టుకున్నడు ఇగ గిప్పుడు సూడు_పిల్లతోని బిడ్డ ఎన్ని కష్టాలు పడ్తుందో”

రాజయ్యమాట్లాడక నుంచున్నాడు. సేటు రాజయ్య కేసి చూస్తూ మార్థవంగా అన్నాడు_

“తెరవొయిస్తావురా?”

“యాడికి బాంచెను?”

“నాగవుతలికి బస్తీదాక”

“అమ్మో సేటూ! గీ పొద్దా? అంతట వొరద మయం తికటి నూడుంద్రి ఎట్లున్నదో. కండ్లకేమన్న కన్పిస్తన్నాది?”

“నువ్వే గిట్లంటె ఎట్లరా! నీకో బుడ్డెడు వొడ్లు గొలుస. తెరవొయి రా రా”

ఎల్లప్పుడూ.....
టి. ఎన్. హెచ్. వారి
* సైనిక్స్ * ఆర్. ఓ.
కలర్ బనియన్లనే
ఉపయోగించండి.
ఆంధ్రా మరియు ఒరిస్సా ఏజెంట్లు:—
దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84, విశాఖపట్నం_4.

## 'ఎస్' బీడీల ఎగుమతి




కెనడా, స్విట్జర్ లాండ్, ఆస్ట్రేలియా, అమెరికా మున్నగు అనేక దేశాలకు మెస్సర్సు ఎ. హబీబిర్ రహమాన్ అండ్ సన్సు, గుడియాత్తంవారు ఉత్పత్తి చేయు 'ఎస్' బీడీలు ఎగుమతి ఔతున్నాయి. అంతేకాదు. అనేక ఇంటర్నేషనల్ ఫైర్సులో వీటిని ప్రదర్శనమునకు పెట్టారు. జర్మనీ (లిప్‌జిగ్ ఫైర్) స్వీడన్. బెల్జియం, సింగపూర్ మున్నగు దేశాలలోనే కాక, అనేక ఆఫ్రికన్ దేశాలలోని ప్రదర్శనాలలో కూడా వీటిని ప్రవేశ పెట్టారు. 'ఎస్' బీడీలకు వారు తయారుచేసిన 20 శాల్తీలు గల సిగరెట్ పెట్టెవంటి పాకెట్లో కొత్త రూపు, అందచందాలుకూడా ఏర్పడ్డాయి.

ఆద్యంతన భవిష్యత్తులో అమెరికా, యూరోపు ఖండాలలో నాగరిక ప్రజలలో సైతం అభిమానులను పెంచుకొని 'ఎస్' బీడి సుస్థిరమైన స్థానం ఆక్రమించగలదను నమ్మిక ఏర్పడ్డది. ప్రాచ్య ప్రాశ్చాత్య దేశాలలో లభించిన విశేష ప్రోత్సాహం దానిని దృఢపరుస్తున్నది.


"వొద్దు సేటూ కాల్మొక్త! ఏరు కట్టలు తెంచుకొని ఉరుక్తాంది. నేను పుట్టిన కాన్నుంచి సూస్తున్న. ఏరు గిట్ల ఎన్నడు పొంగలే. సుట్టు దిరిగి వొంతెన మీది కెల్లి పోదామన్నా నాలుక్కోసులు నడువాలె".

"నువ్వే గిట్లంటే ఎట్లరా రాజిగా! పోనీ వొద్దు కాదు _ బియ్యమే గొలుస్త. ఇంకా పదిరూపాయిలు గూడా యిస్త."

రాజయ్య సేటు మాటలకు ఆశ్చర్య పోయాడు. పిల్లికి బిచ్చం వేయడానిక్కూడా ఇష్టపడని సేటు ఈ సమయంలో బుడ్డెడు బియ్యం, యింకా పదిరూపాయలు కూడా ఇవ్వడానికి సిద్ధపడ్డాడు.

'తను ఆకలితోని సచ్చి పోతండు. ఇంట్లో వాండ్లు చచ్చి చాలా సేపైనట్లుగా వున్నారు. సేటు యిచ్చే బియ్యం, పదిరూపాయిలూ తమ కడుపులు నిండుతయి. అయ్యా ఈ వొరుదల ఈ చీకట్ల ఏరు అవుతల్కి వెళ్ళట మంటే మాటలు గాదు.

"యాయాల వెళ్ళలేను సేటూ బాంచెను! పొద్దు గాల తప్పకుండ వోత" అన్నాడు వినయంగా.

"యాడాదెల్ల ఏట్లనే తిరిగెటోనికి, నీకు భయమేందిరా!" అన్నాడు సేటు నాగభూషణం.

అది గూడ నిజమే! తను దినాం ఏట్లనే దిరుగుతడు ఈదుతడు. మునుగుతడు తేల్తడు. పెరిగి పెద్దోడయ్యిండు ఏటి వొడ్డున్నే!

"గట్లనే పొయ్యొస్తగని బియ్యం జెర జెల్దిన గొలువాలె బాంచెను. ఇంట్ల పొయ్యిల పిల్లి లేసి వారం దినాలాయె."

సేటు నడిచాడు వెనుదిరిగి సంతోషంగా.

అతని వెనుకనే అనుసరించాడు రాజయ్య.

* * *

కడుపు నిండా తిని, చుట్ట ముట్టించి బయట కొచ్చాడు రాజయ్య.

చీకట్లోకి కళ్లు చిట్లించి చూశాడు. కనుచూపు మేర నీరు తప్ప మరేమీ కన్పించడం లేదు.

ఈ సమయంలో... రెక్కలు ముక్కలు చేసుకొని తెడ్లు వేసినా, తన పడవతో ఏరు దాటడం సాధ్యం కాదనుకొన్నాడు.

చుట్టూ తిరిగి, ఏరుదాటకుండా నాలుగు కోసులూ నడిచిపోవడానికే నిశ్చయించుకొన్నాడు రాజయ్య.

అతను రోడ్డు తోవ పట్టాడు.

రెండు వైపులా నీరు పారుతోంది. అక్కడక్కడా రోడ్డును రెండుగా చీల్చుతూ మరీ పారుతోంది.

కటిక చీకటి...జుట్టు విరబోసుకొని, విలయ తాండవం చేస్తోంది.

పెద్ద పెద్ద అంగలేస్తున్నాడు రాజయ్య.

'తెల్లారక ముందే కొంప జేరాల...' పట్టుదలతో ముందుకు పోతున్నాడు.

రాజయ్య వంతెన దగ్గిర కొచ్చాడు—

ఆ వంతెన సావుకారు నాగభూషంగారు కట్టించిందే. ఆ వంతెన కాంట్రాక్టులో ఆయనకి దాదాపు లక్ష రూపాయల లాభం వచ్చిందని చెప్పుకొంటారందరూ.

ఏమైనా — ఆ వంతెన పైన పటారం, లోన లొటారం అన్న రీతిలో సావుకారు కట్టించాడని, అక్కడికి రోజూ కూలీకెళ్ళొచ్చిన తన పెళ్ళాం లచ్చిమి ద్వారా తెల్సింది రాజయ్యకి.

నీరు వంతెన మీంచి పొర్లుతోంది. దూరంగా ఏదో మోత విన్పిస్తోంది.

రాజయ్య నీళ్ళలో వేగంగా నడవలేక పోతున్నాడు. కాలు తీసి కాలు వేయాలంటే త్వరగా సాధ్యం కావటం లేదు. లేని సత్తువతో అట్లాగే ముందుకి నడుస్తున్నాడు.

పైనుంచి ఏదో పెద్ద హోరు దగ్గిరగా విన్పించింది— రాజయ్య అటు చూశాడు.

అతని కళ్ళు రెప్పకొట్టడం ఆగిపోయాయి.

విద్యుత్ వేగంలో వస్తోంది...ఏరో...సముద్రమో చప్పున అర్థం కాలేదు రాజయ్యకు.

అతని కర్థమయ్యేలోపునే—

హోరు దగ్గిరైంది.

నీరు దగ్గిరైంది.

వంతెన ఏమైపోయిందో తెలియదు.

రాజయ్య ఏమయ్యాడో అసలే తెలియదు.

• • •

మర్నాడు ఉదయం—

ఓ రైతు చూశాడు. నమ్మలేనట్లుగా కళ్ళు మిటకరించాడు. ఊరికి దూరంగా ఓ చోట తుమ్మల్లో రాజయ్య శవం చిక్కుకొని వుంది.



మన్నికకు, ఆహ్లాదానికి...
పంజు టెక్స్ వారి
* మాస్టర్ * ఫాంటెక్స్
ఫైన్ బనియన్లనే వాడండి.
ఆంధ్రా మరియు, ఒరిస్సా ఏజెంట్లు:—
దుర్గా ఏజెన్సీస్, ఓ. టి. రోం. 84, విశాఖపట్నం-4.

ఆ రైతు వేగంగా నడిచాడు.

రాజయ్య గుడిసెను సమీపించాడు.

ఈ వార్తను అందజేద్దామనుకున్నాడు.

అయితే—

గుడిసె ముందు మరో శవం దర్శనమిచ్చింది. అది రాజయ్య తల్లిది.

రాజయ్య పెళ్ళాం లచ్చిమి గోడున విలపిస్తోంది. ఆ రైతుకి, రాజయ్య చావుకబురు ఎట్లా చెప్పాలో తోచక నిలువు గుడ్డేసాడు.

నోట మాట రాలేదు చాలాసేపటివరకు.

ఎట్లాగో మాటలు కూడదీసుకొని చెప్పాడు. అది విని రాజయ్య పెళ్ళాం విరుచుకుని పడిపోయింది.

జనం చాలామంది గుడిసెముందు గుమిగూడారు. కాస్తంతలో అందరికీ అర్థమైంది—

లచ్చి ఆ కుటుంబంలో మూడో శవంగా మారిపోయిందని.

• • •

సావుకారు ఎదురు చూస్తున్నాడు—

రాజయ్య యింకా రాలేదు. అతనికి భరించలేని కోపమొచ్చింది.

"దొంగ లంజకొడుకు...! నాగవులికి పోయొస్తానని జెప్పి, బియ్యం, పైసలు రెండూ తీసుకపోయిండు. కడుపునిండదిని, యని ఎగేసినట్టుంది దొంగనాకొడుకు—"

పళ్ళు కొరుక్కుంటూ రాజయ్యకోసం ఎదురుచూస్తూనే వున్నాడు సావుకారు.